# జాడ

తెల్లవార వస్తోంది. ఓ పక్క నుంచీ అన్ని తపనలూ తాపత్రాయాలూ ఏకమై దాడి చేస్తున్నట్టు వెలుగునీడలు ద్వంద్వ యుద్ధం చేసుకుంటున్నాయి.

మరో పక్క నుంచీ రాక్షసి పొగ కమ్మేసినట్లు, చావు వాసన వేస్తున్నట్టు వికృతంగా ఉంది వాతావరణం.

❖ ❖ ❖

ఏ అనంతాకాశాన్నో, తనలోలోపలి పెంజీకటి కవ్వలి లోకాన్నో చూడాలని ప్రయత్నిస్తున్న గాజుకళ్ళ చూపు. కుక్కి నులక మంచానికి కూడా రోత పుట్టిస్తున్న ముది వగ్గు దేహం.

వణుకుతున్న పెదవులు. ఏడుస్తోందా? ఏడవబోతోందా?

జీవం అర్చుకుపోతున్న ప్రాణి – జీవకణాల్ని కోరుతున్న సైగ.

ఎదుటి మనిషి పెదాలూ వణుకుతున్నై.జ పంటితో నొక్కి దుఃఖాన్ని అణచటానికి ప్రయత్నిస్తున్నది. ఆమెకూ ఆరాటంగా ఉంది. ఆవేదనగా వుంది. భయంగా వుంది. శరీరమూ, మనసూ అతలాకుతలమవుతున్నై. కంపించే కాళ్ళతో మంచం దగ్గరగా వెళ్లింది. ఎడమచేత్తో సత్తు గ్లాసుని పట్టుకుని కుడిచేత్తో స్పూన్‌తో ఒక చుక్క పెదవుల మీద వేసింది.

గుక్క పడింది.

క్షణం గడిచింది.

ఆ ప్రాణి మొహం మీద విచ్చాయి. కనురెప్పల అంచుల మీద సన్నని నీడపాడ. మళ్ళీ సైగ చేసింది. నీటి కోసం! మరో చుక్క నీరు!

వచ్చే పోయే ప్రాణం!

❖ ❖ ❖

తెల్లవారింది.

"వెంకమ్మా" - పిలుపు. ఉలుకులేదు.

"వెంకమ్మా" - స్వరం పెరిగింది. పలుకులేదు.

"వెం... క..మ్మా" - అరుపు. జవాబు రాలేదు.

"ఎక్కడ ఛస్తుందో తెలీదు"- విసుగూ, తిట్టూ, ఎక్కడా ఏ అలికిడీ లేదు.

"అడ్డమైన చాకిరీ చేస్తూ వుంటుంది. నాకు కావలసిన పని పట్టించుకోదు" - సుధారాణి వేష్టపడింది.

ఒకరిద్దరు అమ్మగారి దగ్గరగా వచ్చి,. ఓ నిమిషం ఆగినా, అంతలోనే - వర్షం రాబోయే ముందు నడకతో పరిగెత్తాడు.

సుధారాణి ప్రాంగణమంతా కలయ తిరుగుతోంది. తిరిగిన వరండాలూ, హాళ్ళూ, ఆవరణ - మళ్ళీ తిరుగుతోంది చూసిన గదుల్నే మళ్ళీ చూస్తోంది.

సుధారాణికి ఆందోళనగా ఉంది. చావో రేవో తేలిపోబోయే ఇంటర్వ్యూకి వెళ్తున్న ఉద్యోగార్థిలా కంగారు పడుతోంది.

సుధారాణి కాళ్ళల్లో తొట్రుపాటు వుంది. కళ్ళల్లో భీతి వుంది. మాటల్లో ఉద్వేగం వుంది. మనసులో అలజడిగా వుంది.

కొద్ది సేపటిలో చాలా ముఖ్యమైన టీమ్ రాబోతున్నది. ఏం అడుగుతారో? ఏం చూస్తారో? బెరుకు బెరుగ్గా వుంది. ఈ ఒక్క 'విజిట్'తో ఆ టీమ్ పూర్తిగా సంతృప్తిపడిపోవాలి. పని జరిగి తీరాలి.

ఆలోచన సాగుతోంది. కాళ్ళూ సాగుతున్నై.

"జయశ్రీ" - పెద్దగానే పిల్చింది. ఓ పక్క నుంచీ పరిగెత్తుకొచ్చింది జయశ్రీజ. ఆమె ఆఫీస్ ఇన్‌ఛార్జ్. ఇంకా ఒకరిద్దరు చిరుద్యోగాలూ ఆమెతో కలిసి వచ్చారు.

"బయట ఫ్లెక్స్ బోర్డ్సు కట్టేశారా?" ఆవరణంతా క్లీన్‌గా ఉంది గదా?" "ఆఫీస్‌రూమ్?" "రిసెప్షన్?"

"రాజారాంగారూ, వనజాకుమారిగారూ వస్తున్నారు కదా?"

"వాళ్ళే గెస్ట్సని గార్లండ్ చేయాలి. తెలుసుగా?"

ప్రశ్నలు... ప్రశ్నలు.. తూములో నుంచీ దూకే నీళ్ళులా సుధారాణి నోట్లోంచి దుముకుతున్నై.

జయశ్రీ వినయంగా, వివరంగా సమాధానాలు చెప్తోంది.

"బ్రేక్‌ఫాస్ట్?" "కాఫీ, టీ రెండూ సిద్ధమేగా?" "ఆ వరమ్మకి పాలు మొత్తంలో ఒకేసారి సుగర్ కలిపే అలవాటుంది. జాగ్రత్త!" "రూమ్‌లన్నీ చెక్ చేసుకున్నావ్ గదా?" "ఇన్‌మేట్స్‌ని హెచ్చరించావు కదూ?"

"యస్. మేమ్ అంతా సిద్ధం" – జయశ్రీ

జయశ్రీ పక్కనున్న ఒకరిద్దరు కూడా ఆమెకు వత్తాసు పలికారు.

మాట్లాడుతూ మాట్లాడుతూనే మెయిన్ బిల్డింగ్ ముందుకొచ్చింది సుధారాణి. అనుచరులూ ఆమెకు పక్కగా, వెనగ్గా నిలబడ్డారు.

మెట్ల దగ్గర నిలబడి తలెత్తి బిల్డింగ్‌ని చూసింది సుధారాణి. 'అనుకంప వృద్ధాశ్రమం' మెరుపులీనుతోంది. రంగు వేసిన గోడలు ఆకర్షణీయంగా వున్నై.

సుధారాణి తృప్తిగా కళ్ళు చికిలించింది. కదిలి, భవనం చుట్టూ తిరిగి చూసపి మళ్లీ ప్రాంగణంలో కొచ్చింది. ఎంట్రన్స్ గేట్ దాకా నడిచింది. స్వాగతం బోర్డ్ పలకరించింది. చల్లగాలి ఆహ్వానం పలుకుతూ బ్యానర్స్‌ని రెపరెపలాడిస్తోంది.

వాతావరణం ఆహ్లాదంగా వుంది.

సుధారాణి సంతృప్తిగా ఊపిరిపీల్చుకుంది. జయశ్రీ కేసి మెచ్చికోలుగా చూసింది. గేటు లోపల తంగేడుచెట్టు నీడని టేబుల్ వుంది. దాని మీద పూలదండల బుట్ట సిద్ధంగా ఉంది. సుధారాణి కళ్లు మిలమిలలాడాయి. మెచ్చికోలుగా జయశ్రీ వైపు చూసింది.

చెంగున వడి వడి అడుగులతో డైనింగ్‌హాలు దగ్గరికొచ్చింది. అరవైయేళ్ళ అవివాహిత 'బాస్'ని ముగ్గురు బిడ్డల తల్లి జయశ్రీ పడివడిగా అనుసరించలేకపోతోంది. ఆయాసపడుతూ ఆమె కూడా డైనింగ్ హాలు చేరుకుంది.

సభ్యుల బ్రేక్‌ఫాస్ట్ అయిపోయింది. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ బయటకి వస్తున్నారు. వాళ్ల పలకరింపులతోనే హాలు లోపలికి ప్రవేశించింది సుధారాణి. పక్కగా నిలబడింది జయశ్రీ.

"పార్వతమ్మగారూ?" పిలిచింది సుధారాణి.

ఒక టేబుల్ దగ్గర ఎవరితోనో మాట్లాడుతోంది పార్వతమ్మ. ఠక్కున మాట ఆపి "చెప్పండి మేడమ్" అంటూ సుధారాణి దగ్గరకొచ్చేసింది.

'మీరు రెడీయేగదా?" ఆఆ అన్నట్లు తల ఆడించింది పార్వతమ్మ. "రామనాథం గారేరీ?" అంటూ చూపులు ఆయన కోసం అటూ ఇటూ చూసేలోగా –కారిడార్‌లోంచి ఆయనే ఆమె దగ్గరికొచ్చాడు. "మీ యిద్దరికీ చెప్పిందంతా గుర్తుంది కదా. జాగ్రత్తగా మాట్లాడాలి మరి" అని సౌమ్యంగానే హెచ్చరికలాంటి సూచన చేసింది.

"అలాగే మేడమ్" అన్నారు ఇద్దరూ. నవ్వుతూ కొంచెం బెరుకు బెరుగ్గా అని, "మన హోమ్‌లో మీరిస్తున్న సర్వీసెస్ గురించి చెప్పటానికి కష్టమేముంది మేడమ్" అన్నాడు, రామనాథం. "అయినా, ఇంటర్నల్‌గా మనకేమైనా ప్రాబ్లెమ్స్ వున్నా – వాటిని చెప్పుకునే సందర్భం కాదు గదా" అన్నది పార్వతమ్మ.

"అదీ విషయం!" అని మెచ్చికోలుగా చూసింది సుధారాణి. 'గుడ్. జాగ్రత్తగా మాట్లాడండి" అంటూ కదిలింది.

వరమ్మని పిల్చింది. ఆమే కుక్. "అమ్మా" అంటూ వచ్చిందామె.

"అన్నీ సిద్ధం కదా?" అని అడిగింది. వరమ్మ "మీరేం కంగారు పడకండమ్మా, చూస్తారుగా" అని భరోసా యిచ్చింది.

సుధారాణి కాంపౌండు గేటు దగ్గరికొచ్చింది.

అప్పటికప్పుడే ఓబులేసు పూలబుట్టల దగ్గర సిద్ధంగా నిలబడి వున్నాడు.

క్షణాల్లోనే రాజారాం, వనజాకుమారి కూడా కార్లలో వచ్చేశారు.

వాళ్లని రిసీవ్ చేసుకుని, యోగక్షేమాలు పరామర్శించి, బ్రేక్‌ఫాస్ట్ గురించి విచారించింది సుధారాణి. ఇద్దరూ చేసే వచ్చామన్నారు.

చెట్టునీడలో వున్న కుర్చీల్లో కూర్చున్నారు. జయశ్రీ పక్కగా నిలబడి వుంది.

'అరేంజ్‌మెంట్స్ బావున్నాయి. మేడమ్" వనజాకుమారి.

"మీరు చాలా శ్రమ తీసుకుంటున్నారు" రాజారాం.

"పదిమందికి మేలు జరగాలనే కదా మేడమ్ ప్రయత్నం" అన్నది జయశ్రీ.

ఈ పొగడ్తలు గిట్టని దానిలా మొహం పెట్టి, "నా సంగతికేం లెండి. మీరిద్దరూ మన హోమ్‌కి చేసిన సహాయం చాలా గొప్పది. మీ విరాళాలే లేకపోతే నా పనేమయ్యేది?" అని ప్రశంసించింది సుధారాణి.

ఈ మాటలు సాగుతుండగానే కారు వచ్చి నిలిచింది.

టీమ్ సభ్యులు నలుగురూ దిగారు.

పూలదండలతో స్వాగతం పలికారు సుధారాణి బృందం.

పరిచయాలయినై, ముంబై నుంచీ వచ్చిన టీమ్‌లో - బిశ్వాస్, హెడ్‌డే, చంద్రాకక్కర్ వున్నారు. కృష్ణమూర్తి నాలుగవ సభ్యుడు. హైదరాబాద్ యూనిట్ నుంచీ వచ్చాడు.

పరిసరాల్ని చూపిస్తూ హోమ్ విశేషాలూ, వివరాలూ, విలక్షణతలూ తెలియజేస్తూ - వాళ్లని ప్రాంగణంలో నడిపించసాగింది సుధారాణి. జయశ్రీ ఒంటావిడిగా ముందు నడుస్తూ ఆఫీస్ రూమ్‌కి వెళ్లింది.

వీరంతా ఆ వెనగ్గా ఆఫీస్ రూమ్‌కి చేరుకున్నారు కూర్చున్నారు.

జయశ్రీ తన చేతిలోని స్పైరల్ బైండ్ ఫైల్స్‌ని ఆ బృందం సభ్యుల చేతులకి అందించింది.

"బ్రిక్ బై బ్రిక్ ఈ వోల్టేజ్ హోమ్‌ని అభివృద్ధి చేస్తూ వచ్చారు సుధారాణిగారు" రాజారాం చెప్పాడు.

"మేడమ్ కృషి వల్లనే హోమ్ ఈ రోజు ఈ పొజిషన్‌లో వుంది" అన్నది వనజాకుమారి.

రాజారాం, వనజాకుమారి ఇద్దరూ ఇంగ్లీష్‌లోనే మాట్లాడారు. అందువలన బిశ్వాస్ - 'ఐ.సీ...' 'గుడ్' అంటూ ఫైలుని తిరగేస్తూ వారిని చూస్తూ - మధ్య మధ్య ఇతర టీమ్ మెంబర్లనీ చూస్తున్నాడు.

ఆయనే ఆ టీమ్‌కి ఛైర్మన్.

ఆశ్రమం పుట్టు పూర్వోత్తరాలూ, సభ్యుల వివరాలూ, నిర్వహణా విధానం, సౌకర్యాలూ అన్నీ చర్చ కొచ్చినై. అంతా తానే అయి సమాధానాలిస్తోంది సుధారాణి.

"మా కన్‌సర్న్ - మెయిన్‌గా ఇన్‌మేట్స్‌కి మీరు కల్పిస్తున్న సౌకర్యాలూ, వారి సమస్యల పట్ల మీ శ్రద్ధ" అన్నాడు బిశ్వాస్.

ఆ విషయాలన్నే మరికొంత వివరంగా తెలుగులో చెప్పుకొచ్చాడు కృష్ణమూర్తి. అందరూ తలలు ఊపుతూ విన్నారు.

"వివరాల్నీ, ఎకౌంట్స్‌నీ ఎనలైజ్ చేసి చూస్తాము" అంటూ లేచి నిలబడ్డాడు బిశ్వాస్. మిగిలినవారూ లేచారు.

సుధారాణి సైగనందుకుని డైనింగ్‌హాలుకేసి పరుగు నడకతో కదిలింది జయశ్రీ.

నడుస్తున్నారు.

"మేం ఇదివరలో చెప్పినట్లుగానే, మా ఫౌండేషన్ వందేళ్ల నుంచీ దేశమంతటా ఇలాంటి సేవా సంస్థలకి సహాయం చేయటంలో పేరు ప్రఖ్యాతిని గడించుకొన్నది. అయితే, మా ఫండ్స్‌ని అందజేసే విషయంలో మేము కొంచెం స్ట్రిక్ట్." హెగ్డే అన్నాడు.

"మీ బిల్డింగ్ ప్రపోజల్. వేన్ అవసరం వంటివి. ప్రాజెక్టు రిపోర్ట్‌లో చూశాము బాగుంది. మీ సర్వీసెస్ బాగుంటే, మా ఫౌండేషన్ గ్రాంట్‌కి ఇబ్బందేం వుండకపోవచ్చు" అన్నది చంద్రాకక్కర్? తన చున్నీని సరిచేసుకుంటూ, సుధారాణి పక్కగా అడుగులు వేస్తూనూ.

"యా... యా".. అంటూ వారిని అనుసరించింది సుధారాణి.

అందరూ డైనింగ్ హాలుకేసి నడుస్తుంటే, మధ్యలో ఆగింది సుధారాణి. కారిడార్‌లో వో వైపుగా వున్న రామనాథం, పార్వతమ్మల రూమ్స్ చూపించింది సుధారాణి. వాళ్ళిద్దరూ కూడా అక్కడ తమకందుతున్న సౌకర్యాలూ, సదుపాయాల గురించి గొప్పగ్గా చెప్పారు. సుధారాణి నిర్వహణని ప్రశంసించారు.,

డైనింగ్ హాలుకి చేరారు.

బ్రేక్ ఫాస్ట్ జరుగుతోంది.

అప్పుడు పరిగెత్తుకొచ్చింది వెంకమ్మ.

ఎవరో వెంటపడి తరుముతుంటే దూకుతున్న లేగదూడలా వచ్చింది వెంకమ్మ. గసతో రొప్పుతోంది. రొప్పుతో ఎదుర్రొమ్ముల్ని వ్యథ పెడుతోంది. వెంకమ్మదేహం మీది చీరే రెవికా అస్తవ్యస్తంగా వున్నై. చెమటతో తడిసిపోయినై. ఆమె కళ్ళల్లో బెరుకుంది. మొహమంతా దైన్యం పరచుకుని వుంది. ఆమె కాళ్ళల్లో వణుకుంది. దేహమంతా బూడిదరంగు మీది స్వేదబిందువులతో – గొంగళి పురుగులతో వ్న ములగచెట్టులా వుంది. చేతులకి మట్టిగాజులూ, మెళ్ళో చౌకబారు పూసలదండ, మాసిన చీరె, చింకిజుటుట, మురికిచేతులు, గజిబిజిగా, అలసిపోయిన ఆడమనిషిగా వుంది వెంకమ్మ!

చర్చల్లోకి అసందర్భంగా దూకిన మాటలా వచ్చి నిలబడింది వెంకమ్మ. ఎగరొప్పుని ఆపుకుని, ఆపుకుని ఏడుస్తోంది. ఏడుపుని ఆపుకోవాలనుకుని చేతులతో మొహాన్ని కప్పుకుంటోంది. ఏమీ చెప్పలేక ఏడుస్తూ చేతులు తిప్పుతోంది. చేతులు తిప్పుతూ నలుగుర్నీ, నాలుగు దిక్కుల్నీ చూస్తోంది.

వెంకమ్మని చూసిన అందరూ నిశ్చేష్టులై వున్నారు.

సుధారాణి తెప్పరిల్లింది. కళవళపడే మొహంతో వెంకమ్మని అసహ్యంగా చూసింది. కోపం కళ్ళల్లోకి ఎగదట్టింది. "చెప్పి చావ్" అన్నది.

జయశ్రీ మేడమ్‌నీ, వెంకమ్మనీ చూపులు మారుస్తూ చూస్తూ, సుధారాణి ఆజ్ఞ కోసం లేచి నిలబడింది.

వెంకమ్మ బెక్కుతూ, బెక్కుతూ, "అమ్మా... అమ్మా... మంగమ్మచచ్చిపోయింది" అని గోడకి చేరగిలబడి కూలబడిపోయింది.

జయశ్రీ నిలువు గుడ్లేసుకుని చూస్తున్నది.

నోరూ వాయీ పడిపోయినట్లు దిగ్భ్రమ చెందింది సుధారాణి.

రాజారాంకీ వనజాకుమారికీ పెదవులు కదిలినై కానీ, ఏ మాటా పైకి రాలేదు.

రామనాథం, పార్వతమ్మమొహమొహాలు చూసుకున్నారు.

వరమ్మ మాత్రం టేబుల్ పట్టుకుని, నిలబడి, "అదేంటే.. అదేంటే..?" అన్నది నోరెళ్ళబెట్టి.

టీమ్ మెంబర్లంతా 'వాహ్‌ట్? వాహ్‌ట్? అని కృష్ణమూర్తికేసి చూశారు.

షాక్ నుంచీ తెప్పరిల్లింది సుధారాణి. తెలివి తెచ్చుకుంది. సమయమూ, సందర్భమూ స్ఫురణకొచ్చినై. ఎవరో వెన్ను చరిచినట్లు కవిత్వం గుర్తుకొచ్చింది. తొట్రుపాటుని అణుచుకుంటూ "జయశ్రీ నువ్వెళ్ళి ఆ వషయాల్ని మేనేజ్ చెయ్ క్విక్" అని ఆమెకు చెబుతూ, "ప్లీజ్; మీరూ కొంచెం హెల్ప్ చెయ్యాలి" అని రాజారాం వైపు, వనజాకుమారి వైపు చూసింది.

అలాగే అన్నట్లు చూపులతో చెప్పి కదిలారా ముగ్గురూ.

"సారీ... సారీ ఫర్ ద ఇన్‌కన్వీనియన్స్" అన్నది సుధారాణి టీమ్ సభ్యుల్ని చూస్తూ.

సరిగ్గా అప్పుడే కృష్ణమూర్తి "సమ్‌బడీ ఎక్స్‌పైర్‌డ్" అన్నాడు. ఇంతకు ముందు బిశ్వాస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా.

తాను కూడా లేచి వెళ్లబోతున్న వెంకమ్మని చూస్తూ గద్దించింది సుధారాణి. "పొద్దున్నుంచీ నువ్వెక్కడ చచ్చావసలు?" కళ్లల్లో నిప్పులు చెరిగింది.

ఏడుస్తూనే చెప్పింది వెంకమ్మ. "నిన్నల్లా మన డాక్టర్‌గారి కోసం తిరుగుతూనే వున్నాగదమ్మా. మీరు చెప్పారని చెప్పినా ఆ డాక్టర్‌గారు రాలేను పొమ్మన్నారు. రాత్రంతా నరకయాతన పడింది మంగమ్మ. తెల్లవారుఝాము నుంచీ ఎక్కిళ్ళు. ఎగశ్వాస. ఇంతమందిమి వుండీ ఏమీ చెయ్యలేకపోయాం. ఎవరికి చెప్పినా, అందరూ ఇవాళ్టి మీటింగ్ బిజీగున్నరు" అని మరో మారు బోరుమంది.

వరమ్మ కాఫీలు తెచ్చింది.

సరే అవతలికి పొమ్మన్నట్టు చెయ్యి చూపింది సుధారాణి. వెంకమ్మ కళ్ళల్లోకి చూస్తూ, గాలి తాకిడికి కదిలిన తాటాకు పుట్టిలి కదిలింది వెంకమ్మ.

ఎవ్వరూ కాఫీలు కూడా తీసుకోలేదు.

డైనింగ్ హాలు బయటికి నడిచారందరూ

బిశ్వాస్ అందరినీ చూస్తూ అన్నాడు. "ఉయ్ విల్ సీ దట్ వుమన్" అని. అందరూ మొహమొహాలు చేసుకున్నారు.

సుధారాణి కృష్ణమూర్తి వైపు ప్రాధేయపూర్వకంగా చూసింది. ఈ ప్రయత్నాన్ని వారించలేరా అన్నట్టుంది ఆ చూపు.

"మీరు అక్కడికెందుకు సార్?" అన్నది నిబ్బరాన్ని కూడదీసుకుంటూ. కృష్ణమూర్తి ఏదో అనేలోగా, "కమాన్ ప్లీజ్" అంటూ ముందుకు అడుగేశాడు బిశ్వాస్.

మిగిలినవాళ్ళు అనుసరించక తప్పలేదు.

వరమ్మ వెనకనుంచీ పరుగులాంటి నడకతో వచ్చి ప్రాంగణంలో ఓ పక్కకి దారితీసింది. ఆమెతో నడిచారు మిగిలిన వాళ్ళంతా.

అక్కడ,

వృద్ధాశ్రమం దక్షిణవైపు ప్రహరీగోడనానుకుని బంగళా పెంకుల వసారా. నడికప్పు విరిగి, దాదాపు నేలబారు కొచ్చేసింది. అవసరా పక్కగా గొడ్లసావిడి. సావిడిలో ఒక గేదె. ఒక ఆవు. ఒక దూడ.

పెంకుల వసారా బూజుపట్టిన గతంలా వుంది. అన్ని నిర్లక్ష్యాల నీడన వాడిన పిచ్చిమొక్కల్లా వుంది. పేగు తెగిన నిర్దయ విసిరిపారేసిన పసిగుడ్డులా ఉంది. ఏ దిక్కూమొక్కూలేని చచ్చిపోయిన వృద్ధాప్యంలా ఉంది. ఏడ్చి ఏడ్చి అలసిపోయిన అమాయకత్వంలా, కరిగిపోయిన కారుణ్యంలా వుంది.

వసారాలో కుక్కినులక మంచం.

దగ్గరైన అన్ని కళ్ళకీ ఎదురుగా – ఎనభై ఏళ్ళ మంగమ్మ శవం.

కుడి ఎడమల – నాని, మాగి, కుళ్ళిన, చివికిన ఎండుగడ్డి వాసన. మురుగు కంపు.

టీమ్ సభ్యులంతా కర్చీఫ్‌లతో ముక్కులు మూసుకునే మంగమ్మని చూశారు. కడుపులో వికారంతోనే పరిసరాల్నీ భరించారు. జీవం ఆర్పుకుపోయిన ప్రాణి పక్కగా దుఃఖాన్నీ, ఏడుపునీ చీరెకొంగున బిగిస్తున్న వెంకమ్మనీ చూశారు. చుట్టూరా చేరిన ఇన్‌మేట్స్‌నీ, వరమ్మనీ, జయశ్రీనీ, రాజారాంనీ, వనజాకుమారినీ, చూశారు. అప్పుడు సుధారాణినీ చూశారు. ఆమె మొహం మీది ఏవగింపునీ చూశారు.

ఎవ్వరూ ఎవ్వరినీ, ఏమీ అడగలేదు.

బిశ్వాస్ మాత్రం వెనక్కి తిరిగి, అడుగుకదలిస్తూ – "పూర్ ఫెలో... మిజరబుల్ డెత్!" అని తనకు తానే చెప్పుకున్నాడు.

వాతావరణం ముసురుపట్టింది. ఆ తర్వాత – వేయని ప్రశ్నలకే, చేసిన అర్థింపులకూ కూడా "లెటజ్‌సీ" సమాధానంగా తిరుగు ప్రయాణమైంది టీమ్. టౌన్ పొలిమేరల దాకా సాగనంపివచ్చింది సుధారాణి.

ఆ సాయంత్రానికి మంగమ్మ శవం లేచింది.

వెంకమ్మ ఏడుస్తూనే వుంది. వరమ్మ మంగమ్మ బతుకు గతాన్ని తవ్వుకుంటూ, లోలోపల ఏడుస్తూ, బయటి పనులన్నీ చేసిన ఇంత వుడకేసి అందరికీ పెట్టింది.

ఇన్‌మేట్స్ అందరి మనసులూ కలచిన చెరువులై పోయాయి.

ఆ రాత్రంతా నిద్రలేదు సుధారాణికి.

ఆ మర్నాడే వెంకటమ్మని పని నుంచీ తీసేయాలని పిలిపించింది కానీ, ఆమె అప్పటికే ఆశ్రమం వదిలి వెళ్ళిపోయిందని తెలిసింది. ఎక్కడికిపోయిందో తెలీదన్నారు.

రోజులు గడుస్తున్నాయి.

సుధారాణికి మానసిక ప్రశాంతి కరువైంది. హోమ్ నిర్వహణ కష్టమవుతోంది. ఆర్థికంగానూ ఇబ్బందిగానే వుంది. ఒకరిద్దరు ఇన్‌మేట్స్ వెళ్ళిపయారు. యాంత్రికంగా పనులు చేస్తున్నా కలవరపడుతోంది.

నెల గడిచింది.

వేరే మంచి ఉద్యోగం వచ్చిందని చెప్పి వెళ్ళిపోయింది – జయశ్రీ

జరిగిన ఘటనలు పీడకలలైనాయామె పాలిటికి.

చనిపోయిన మంగమ్మ, వెళ్ళిపోయిన వెంకమ్మ. జయశ్రీలే కళ్లమందు మెదులుతున్నారు. అస్తిమితంగా ఉంటోంది.

రెండు నెలలు ఇట్టే తిరిగాయి.

ముంబై ఫౌండేషన్ నుంచీ జాడా జవాబూ లేదు. గ్రాంట్‌వచ్చేదీ, లేనిదీ తెలియటం లేదు. మనసులో అనేక ఆలోచనల జడివాన. తుఫాను!

ఉండలేక హైదరాబాద్ కృష్ణమూర్తికి ఫోన్ చేసింది.

బిశ్వాస్ అన్న మాటల్ని చెప్పాడాయన.

'అనుకంప లాంటి వోల్డేజ్ హోమ్స్‌కి' కావలసింది ఫండ్స్ కాదు. వెంకమ్మలాంటి మనుషులలు కావాలి. అదీ ఎక్కువ సంఖ్యలో! 'ఇంకో ముఖ్యమైన విషయం – ఒకవేళ వెంకమ్మలున్నా, సుధారాణుల మైండ్‌సెట్ మారాలి!"

వెన్ను చరిచినట్లైంది సుధారాణికి. ఉన్నట్టుండి భవిష్యత్ స్పృహ తోచింది. తన వయస్సిప్పుడు – అరవై రెండు! తనకూ తన వారెవరూ లేరు!

ఏడుపు ముంచుకొచ్చింది సుధారాణికి.

'వెంకమ్మ జాడ తెలిసేదెట్లా?!'

సుధారాణి ఆలోచిస్తూనే వుంది!!!

**–సాహితీ స్రవంతి– సాహిత్య పత్రిక, సెప్టెంబర్– అక్టోబర్, 2011**